www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 28 జులై 2025



ఉపాధిలో అవినీతికి చెక్

- ఉపాధి హామీ చట్టంలో కొత్త రూల్స్.. 1 నుంచి అమలు..
- కూలి డబ్బులు రావాలంటే రెండు పూటలా ఫోటోలు తీయాల్సిందే..
- కఠినతరం కానున్న నిబంధనలు.. ఇకపై ఫేక్ మస్టర్లకు చెల్లి చీటీ..
- ఏఐ టెక్నాలజీతో ఉపాధి యాప్ అనుసంధానం..

ఉపాధి హామీ చట్టంలో శ్రామికులు పనికి రాకుండా వచ్చినట్లు హాజరు వేసుకోవడం, చేయని పనులకు చేసినట్లుగా రికార్డులో నమోదు చేయడం వంటి అక్రమాలు ఎన్నో తరచూ వెలుగు చూస్తున్నాయి. ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చిన వాటికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. క్షేత్రస్థాయిలో జరిగే అవకతవకలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త విధానాన్ని చేపట్టింది. పని చేసే ప్రదేశంలో కూలీలకు రెండుసార్లు ఫోటోలు తీసి ఆన్లైన్లో పొందుపరచాలని తాజాగా విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొంది. ఆగస్టు నెల 1వ తేదీ నుండి ఈ నిర్ణయాన్ని అమల్లో తీసుకురానుంది.

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో కార్మికుల ఫోటోలను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫస్ట్ ఫోటో ఉదయం 9 గంటలకు తీసి అప్లోడ్ చేయాలి. తర్వాత ఫోటో సాయంత్రం నాలుగు గంటలకు తర్వాత తీయాల్సి ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఈ ఫోటోలను పంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అంతేకాకుండా మండల స్థాయి అధికారులు ఎన్ని ఫోటోలు సరిగ్గా తీశారు ఎన్ని తీయలేదని అనేవి చెక్ చేయాలి. అన్ని గ్రామాల నుంచి వచ్చిన వాటిలో 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు పంపించాలి. జిల్లా ఆఫీసులో ప్రతి ఫోటోను జాగ్రత్తగా భద్రపరచాలని కేంద్రం ఆదేశించింది. గ్రామస్థాయి నుంచి వచ్చిన ఫోటోలు సరిగ్గా ఉన్నాయా లేదా ఇతర ఫోటోలు యాప్‌లో లోడ్ చేశారా.. అటెండెన్స్‌లో ఏమైనా... వ్యత్యాసాలు ఉన్నాయా.. అనే విషయాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు గ్రామస్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది ఎప్పటికప్పుడు రివ్యూ జరిపి అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఏఐ ఇట్టే పసిగట్టేస్తుంది..

ఉపాధి హామీ చట్టంలో చేపట్టే ఏ పనినైనా ఆ పని మంజూరు సమయంలో ఆ పని ప్రదేశంలో జిఓ టాకింగ్ వివరాలను నమోదు చేయడం కొన్ని ఏళ్ల నుండి అమలులో ఉంది. అయితే ఇప్పుడు మంజూరు సమయంలో ఆ పని ప్రదేశంలో పేర్కొనే జియో టాకింగ్ వివరాలను కేవలం 10 మీటర్ల పరిధిలో కూలీల రోజు వారి హాజరు. రెండు విడతల ఫోటోలు తీస్తూనే యాప్‌లో నమోదుకు వీలుండేలా యాప్‌ను ఆధునికరించింది. ఒకరిద్దరితోనే వేరువేరు ఫోటోలతో ఎక్కువమంది హాజరైనట్లు మస్టర్లు నమోదు చేయడం మాస్టర్ నమోదుకు వీలు లేకుండా ఏఐ టెక్నాలజీ సాయంతో పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఒక వ్యక్తిని ఒకేరోజు రెండు మూడు మస్టర్లకు సంబంధించిన ఫోటోల్లో నమోదు చేసేందుకు ప్రయత్నిస్తే ఏఐ ఇట్టే పసిగట్టేస్తుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ సంబంధించి చిత్తూరు జిల్లాలో జిల్లా పాదకసంచాలకులు రవికుమార్ 31 మండలాలకు సంబంధించిన ఏపీఓలకు, క్లస్టర్ ఏపీడీలకు సమావేశం నిర్వహించి ఉపాధి హామీ చట్టం అమలు పగడ్బందీగా పారదర్శకత జవాబుదారీతనంగా చేపట్టి గ్రామీణ స్థాయిలోని పేద ప్రజలకు పనులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అవకతవులు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొత్త నిబంధనలు ఇవే..

1. ఇకపై కూలీలకు డబ్బులు రావాలంటే పనిచేసే చోట కూలీలను రెండుసార్లు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలి.
2. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్లో కార్మికుల ఫొటోలను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫస్ట్ ఫొటో ఉదయం 9గంటలకు తీసి అప్‌లోడ్ చేయాలి. తర్వాతి ఫొటో సాయంత్రం 4గంటలకు తర్వాత తీయాల్సి ఉంటుంది.
3. ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఈ ఫొటోలను పంచాయతీ సెక్రెటరీలు నిరంతరం పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్రం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.
4. అంతేకాకుండా మండల స్థాయి అధికారులు ఎన్ని ఫొటోలు సరిగ్గా తీశారు, ఎన్ని తియ్యలేదని అనేవి చెక్ చేయాలి.
5. అన్నీ గ్రామాల నుంచి వచ్చిన వాటిలో 20శాతం వివరాలను జిల్లా అధికారులకు పంపించాలి. జిల్లా ఆఫీసులో ప్రతి ఫొటోను జాగ్రత్తగా స్టోర్ చేయాలని కేంద్రం తెలిపింది.

పోలీస్ ఉద్యోగం క్రమశిక్షణతో కూడినది : ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పోలీసు ఉద్యోగం, విలువలు, క్రమశిక్షణతో కూడుకున్నదని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్ల సమావేశం ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లాకు 36 మందిని ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. వారిలో కర్నూలు రేంజ్‌కి చెందిన వారు 32 మంది, గుంటూరు రేంజ్‌కి చెందిన నలుగురు ఉన్నారు. వీరిలో 21 మంది ఎస్ఐలు, 15 మంది డబ్ల్యూ ఎస్ఐలు ఉన్నారు. వీరికి జిల్లా లోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపడుతున్న ఎస్సైలు పోలీస్ శాఖపై గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ శాఖలో హోంగార్డు నుండి ఉన్నత స్థాయి అధికారి వరకు అందరూ ఒకటేనని ప్రతి ఒక్కరిని మీరు గౌరవించాలన్నారు. టెక్నాలజీతో అనేక కేసులను ఛేదించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి వెంకట్రావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

యస్వీయూ అభివృద్ధికి సహకరిస్తాం : గవర్నర్

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన ఆచార్య అప్పారావు, ఆచార్య భూపతి నాయుడు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలో బోధన, పరిశోధన రంగాలకు సంబంధించిన ప్రగతిని గవర్నర్‌కు వివరించారు. ఆయన స్పందిస్తూ ఎస్వీయూ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి, గవర్నర్ కార్యాలయం నుంచి ఎల్లవేళలా పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటుగా వారికి ఉపాధి అవకాశాలు కల్పన కోసం పూర్తిస్థాయిలో కృషి చేయాలని వీసీ, రిజిస్ట్రార్‌లకు గవర్నర్ సూచించారు.

డాక్టర్ ఆర్.కె.రెడ్డికి రాష్ట్రీయ పురస్కారం

పురస్కారం అందుకున్న ఆర్.కె విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గానసభ వేదికగా, నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో "రాష్ట్రీయ పురస్కార్ - 2025" అవార్డును ఆర్.కె.ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్ జస్టిస్ టి.అమర్నాథ్ గౌడ్, తెలంగాణ మాజీ మంత్రి వేణుగోపాల్ ఆచార్య, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. విద్యారంగంలో అనన్యమైన సేవలు, సృజనాత్మక విద్యా విధానాల రూపకల్పన, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రత్యేక కృషి చేసినందుకు ఈ పురస్కారం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ "ఈ అవార్డు నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, మొత్తం ఆర్.కె. ఇన్స్టిట్యూషన్స్ టీమ్ కృషికి గుర్తింపన్నారు. ఉన్నత విలువలు పెంపొందించే విధంగా మరింత కృషి చేసి, విద్యారంగంతో పాటు సామాజిక రంగంలోనూ సేవలు ముందుకు తీసుకువెళ్లగలమని సముద్రాల వేణుగోపాలాచారి తెలిపారు. డైరెక్టర్ ఆర్.కె. విమల మాట్లాడుతూ ఆర్.కె. ఇన్స్టిట్యూషన్స్ గత 14 సంవత్సరాలుగా విద్యారంగంలో విద్యార్థులకి సహకారం అందిస్తూ, ఎన్నో మైలు రాళ్ల దాటిందన్నారు. ఈ నార్త్ ఢిల్లీ అకాడమీ పురస్కారం మరింత ప్రోత్సాహం ఇచ్చిందన్నారు. భవిష్యత్తులో విద్యారంగంతో పాటు సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడా కృషి కొనసాగిస్తామని తెలిపారు.

ఆస్టర్ నారాయణాద్రిలో ప్రత్యేక క్రీడా కార్యక్రమం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ తరపున, గత ఏడాది మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేసుకున్న రోగుల కోసం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేకంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మోకాళ్ల ఆరోగ్యం, శస్త్రచికిత్స తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్థోపెడిక్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థోపెడిక్ డాక్టర్ల వద్దకు వచ్చే రోగుల్లో సుమారు 30 శాతం మంది మోకాళ్ల నొప్పి గురించి ఫిర్యాదు చేస్తున్నారు. వీరిలో చాలామంది వృద్ధులు ఉన్నప్పటికీ, ఇప్పుడు యువతలో కూడా మోకాళ్ల సమస్యలు పెరుగుతున్నాయన్నారు. అందరికీ శస్త్రచికిత్స అవసరం లేదని, వ్యాయామం, వైద్యుల సూచనలతో సమస్యను తగ్గించుకోవచ్చన్నారు. సి.ఓ.ఓ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ ద్వారా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ తమ ఆర్థోపెడిక్ విభాగంలో రోగులకు పూర్తి సహకారం అందిస్తున్నదని నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, మోకాళ్ళ మార్పిడి చేసుకున్న రోగులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ స్టేషన్ సందర్శించిన డిఐజి

ప్రజాశక్తి - వాకాడు: మండల పరిధి, దుగరాజపట్నం, మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం మెరైన్ డిఐజి గోపీనాథ్ జెట్టి సందర్శించారు. మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది డిఐజికి గౌరవ వందనముతో స్వాగతం పలికారు. స్టేషన్లోని పలు రికార్డులను డీఐజీ పరిశీలించారు. మెరైన్ కార్యకలాపాలపై ఆరా తీశారు. మెరైన్ సేవలను విస్తృత పరుస్తూ, తీరం వెంబడి నిఘా ఉంచాలని సూచించారు. డీఐజీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు శివ సౌమ్య, అంజిరెడ్డి తదితరులున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్థానిక కరకంబాడి రోడ్డులోని పంజాబ్ అండ్ సింధు బ్యాంకు బిల్డింగ్ మొదటి అంతస్తులోని ఆరె కృష్ణ కు చెందిన కార్యాలయంపై దాడికి పాల్పడిన వైసిపి గుండా చైతన్య యాదవ్, అతని అనుచరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చైతన్య యాదవ్ ఆరె కృష్ణకి చెందిన ఆఫీసు రూమును రెండేళ్లకు ముందు నుంచి అద్దెకు తీసుకుని అద్దె చెల్లించకుండా, విద్యుత్ ఛార్జీలు చెల్లించకుండా దౌర్జన్యకరంగా ప్రవర్తించేవాడు. ఇటీవల అతనిపై పెట్టిన కేసులు కారణంగా పరారీ అయ్యారని వేణుగోపాల్ ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆరే కృష్ణ తన కార్యాలయాన్ని పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కార్యాలయాన్ని తన అక్రమ వ్యవహారాలకు కేంద్రం చేసుకొని నడిపినట్టుగా ఈ సందర్భంగా యజమాని గుర్తించారని, ఇదే విషయమై పోలీసులకు రాతపూర్వక ఫిర్యాదు చేశారని తెలిపారు. అనంతరం కార్యాలయాన్ని మరమ్మత్తులు చేసి మరొకరికి అద్దెకివ్వగా శనివారం రాత్రి ఈ విషయం తెలుసుకున్న చైతన్య యాదవ్ మరికొందరితో కార్యాలయం పైకి వచ్చి తన వెంట తెచ్చుకున్న ఆయుధాలతో అద్దాలను బద్దలు కొట్టి వస్తువులను చిందరవందర చేసి ఐదు లక్షలకు పైగా ఆస్తి నష్టాన్ని కలిగించారని పేర్కొన్నారు. ఈ విషయమై కార్యాలయ యజమాని ఆరె కృష్ణ పోలీసులకు ఆదివారం నాడు ఫిర్యాదు చేశారని వివరించారు. సాధారణ ప్రజలపై వారి ఆస్తులపై దాడికి పాల్పడి ఆస్తి నష్టానికి గురిచేసిన చైతన్య యాదవ్‌ను వారి అనుచరులను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వేణుగోపాల్ ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన స్థలాన్ని సిపిఎం బృందం పర్యటనుంచి దాడికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి సుబ్రహ్మణ్యం, సత్యం నగర కార్యదర్శి కే వేణుగోపాల్, నేతలు పి.చిన్న, ఎం.నరేంద్ర, ఎండి శ్రీనివాసులు, ఆనంద్, కిరణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం వెంకటేష్ యాదవ్‌కు

బ్రాండ్ ఆఫ్ ఇండియా అవార్డు

ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఉత్తమ నెల్లూరుకు చెందిన గుర్రం వెంకటేష్ యాదవ్ హైదరాబాదులో అరుదైన బ్రాండ్ ఆఫ్ ఇండియా - 2025 బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో ఎస్సీ ఎస్టీ కాలనీలోని గృహాలకు కైసర్ ప్రొడక్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేసినందుకు గాను ఆయనకు ఈ అవర్డు లభించింది. ఆయన శనివారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్ హోటల్ దాసిపల్లిలో జరిగిన ఎనెలెప్ గ్రూప్ వారి బ్రాండ్ ఆఫ్ ఇండియా 2025 వేడుకల భాగంగా అశోక్ యాదవ్ బెస్ట్ ఫర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు.

విద్యార్థినులకు ఎమ్మెల్యే పరామర్శ

బాలికల హాస్టల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి -కోట : కోట, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్.సుభాన్ విచక్షణా రహితంగా విద్యార్థులను కొట్టడంతో అస్వస్థకు గురైన ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులను ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పరామర్శించారు. దళిత నాయకులు, జన సేన, మాల మహానాడు, వైసీపీ స్టూడెంట్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు ఎస్సీ విద్యార్థులకు జరిగిన అన్యాయంపై హాస్టల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థులను పరామర్శించి, తల్లిదండ్రులను ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ పేద దళిత బిడ్డలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోక తప్పదన్నారు. ప్రధానోపాధ్యారాలు, సహ ఉపాధ్యాయులు మౌనం వహించారని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యాయామ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు స్థానిక ఎంఈఓ ధారా మస్తానయ్య తెలియజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్ కుమార్ రెడ్డి, ఏ ఎస్ డబ్ల్యూ ఓ మనోజ్ కుమార్‌లు హాస్టల్‌కు చేరుకుని జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్ ధరించి పాఠశాలకు రాలేదనే సాకుతో 70 మందికి పైగా దళిత విద్యార్థిలను పైశాచికంగా కొట్టి, కొందరితో గుంజిళ్లు తీయించి హింసించిన పిఈటి షేక్ సుభాన్‌ను అరెస్టు చేయాలని, అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని ఐడిజేఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు డి కిరణ్ డిమాండ్ చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల: భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన కుటుంబసభ్యులు, సినీ నటుడు విజయ్ దేవరకొండ నటి భాగ్యశ్రీ భోర్సే, కింగ్‌డమ్ మూవీ టీమ్ ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల కొండకు చేరుకొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా 3850 క్యూసెక్కుల కృష్ణా జలాలనుఅడివిపల్లి రిజర్వాయర్ నింపి, హంద్రీనీవా కాలువ ద్వారా భవిష్యత్తులో తిరుపతికి తాగు పారిశ్రామిక అవసరాలకు నీటిని అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. 25 ఏళ్ళ చరిత్రలో మొదటి సారి జులైలో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు విడుదల చేసాం. శ్రీశైలం మల్లన్న చెంత నుంచి కృష్ణా జలాలను తీసుకొచ్చి, బాలాజీ రిజర్వాయర్లను అన్నింటిని నింపి, తిరుమలకు వచ్చే భక్తులకు తాగునీటి కొరత లేకుండా గోవిందుని చెంతకు తరలిస్తామని వెల్లడించారు. వీరికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామల రావులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వెంకయ్య నాయుడు, టీటీడీ ఛైర్మన్‌తో కలిసి తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

అన్నప్రసాదం స్వీకరిస్తున్న వెంకయ్య నాయుడు

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

మంత్రి నిమ్మల రామానాయుడు

సినీ నటుడు విజయ్ దేవరకొండ

పారిశుద్ధ్య పనులు ప్రైవేట్ కాంట్రాక్ట్‌కి అప్పగించరాదు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పనులు ప్రైవేట్ వర్క్ కాంటాక్ట్‌కి అప్పగించే పని మానుకోవాలని సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ ఫెడరేషన్ గౌరవా ధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి జిల్లా గూడూరు, సి.ఐ.టి.యు కార్యాలయంలో ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సి.ఐ.టి.యు అనుబంధం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జిల్లా కార్యదర్శి ధారా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో : బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 17 రోజులు సమ్మె సందర్భంగా ఒప్పుకున్న అంశాలకు జీ.వోలు ఇప్పటివరకు జారీ చేయలేదని, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సొంత మున్సిపాలిటీ అయిన నెల్లూరులో మున్సిపల్ కార్మికుల పనులు ప్రైవేట్ వర్క్ కాంటాక్ట్‌కి పని ప్రవేశ పెట్టడం దారుణమని ఆరోపించారు. మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డీ పల్లి చెంగయ్య మాట్లాడుతూ గత ఇంజనీరింగ్ వర్కర్స్‌కు జీతాలు పెంపుకు కమిటీ వేశారని, కాలయాపనతో తప్ప పరిష్కారానికి నోచుకోలేదని మండి పడ్డారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గూడూరు మున్సిపల్ సంగం గౌరవాధ్యక్షులుగా జోగి శివకుమార్, అధ్యక్షులుగా భూలోకం రమేష్, ఉపాధ్యక్షులుగా మణెమ్మ, ఎం. వెంకటరమణ, జి.మణి.ఆర్. ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా భూలోక మురళి, సహాయ కార్యదర్శి జి.మేరీ.ఏ.శాంతి వర్ధన్,కే.నారాయణమ్మ, కోశాధికారి సి.హెచ్.రాజేష్, పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి. రమణయ్య, ఉపాధ్యక్షులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం

ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నింద్ర మండలం, ఓరూరుపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గ మళ్ళీ ప్రసాదరావు, నగరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు చిరస్మరణీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఏర్పేడు: విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఎలా ఉండాలనే దానిపై బాలల రక్షణ, సైబర్ భద్రత నిపుణులు రత్న శేఖర్ ఏర్పేడు సమీపంలోని ఎస్ఓఎస్‌లో ఏర్పాటుచేసిన సైబర్ భద్రతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా అనుమానస్పద ఆన్లైన్ ఘటనలు ఎదురైతే పెద్దలకు తెలియజేయాలని, మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం రక్షణ, సైబర్ బుల్లియింగ్ నివారణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లాం, అక్కుర్తి గ్రామాల పిల్లలు, సత్యనారాయణ, మునిరత్నం, ఆనిమేటర్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాలను నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. గూడూరు ఒకటవ పట్టణం, రాణి పేటలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఒకటవ పట్టణ ఎస్ఐలు తిరుపతయ్య , రూరల్ ఎస్.ఐ మనోజ్ కుమార్, రెండో పట్టణ, చిల్లకూరు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శాంతి, భద్రతలు కాపాడటం, నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టణంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి నిఘా పెంచడం జరిగిందని డీఎస్పీ నరసింహ మూర్తి తెలిపారు. గంజాయి వినియోగం, విక్రేతలపై ఉక్కుపాదం మోపేందుకు నైట్ విజన్ డ్రోన్ లను సైతం వినియోగిస్తున్నట్లు చెప్పారు. సీఐలు గోపి, నాగార్జున రెడ్డి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యామినికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని కె.యామినికి వర్సిటీ పరీక్షలు నియంత్రణాధికారి ఆచార్య అనురాధ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఆచార్య సునీత బాయ్ మార్గదర్శకత్వంలో "ఫెర్టిసైజింగ్ అఫ్ లో అచీవర్స్, ఫెయిల్యూర్స్, పేరెంట్స్ అండ్ టీచర్స్ బిహేవియర్ ది కాసెస్ ఫర్ లో అచీవ్మెంట్ ఇన్ బయాలజికల్ సైన్సెస్" అంశంపై పరిశోధన గ్రంధం వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా, రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, బ్యాడ్ క్యారెక్టర్ వ్యక్తులపై పోలీస్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ జయచంద్ర మాట్లాడుతూ, నేరాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరచరిత్ర గల వారు ఇకపై క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు డీఎస్పీ గీతా కుమారి సూచించారు. ఆదివారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో పట్టణ, రూరల్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తులు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శేఖర్ బాబు, ఎస్ఐలు మనోజ్ కుమార్, తిరుపతయ్య పాల్గొన్నారు.

పంచగవ్యతో యువతకు సాధికారత

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్రం, భారత్ ఏకం సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సంస్థలతో కలిసి "సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ - సాంస్కృతిక మూలాల నుండి ఆర్థిక మార్గాలవైపు" అనే శీర్షికతో ఒక రోజు కార్యాక్రమాన్ని నిర్వహించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలో, సృజనాత్మక ఆర్థిక నిపుణురాలు డా. పి. హర్ష భార్గవి ఆధ్వర్యంలో పంచగవ్య అంటే దేశీయ ఆవు నుండి పొందిన ఐదు పదార్థాలు (పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, గోమయం) ఆధారంగా ఆరోగ్య, జీవనశైలి, పర్యావరణహిత ఉత్పత్తులను తయారు చేయడం ఎలా ఒక ఆదాయ మార్గంగా మలచవచ్చో వివరించారు. పంచగవ్య ఆధారిత ఆరోగ్య పరిష్కారాలు, స్వయంగా తయారు చేసుకునే క్రాఫ్ట్ ఉత్పత్తులు, నగలు, దీపాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులతో సహా 50 మందికి పైగా పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులకు పరిహారం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం : చంద్రగిరి నియోజకవర్గంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ. 25 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేసిందని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆదివారం చంద్రగిరి నియోజకవర్గం, పులివర్తి వారిపల్లి, ఎమ్మెల్యే స్వగృహంలో రైతులకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాధవిలత, సిడిఎంఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, వినోద్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పీఎండీఎస్ కిట్లు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలంలో, రైతు సేవా కేంద్రాల ద్వారా పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, భూమి సారాన్ని పెంచి, భూమికి సత్తువనిచ్చే 26 రకాల విత్తనాల కలయికతో పి.ఎం.డి.ఎస్ కిట్లను రాయితీ పై సరఫరా చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి, గూడూరు వి.రమేష్ తెలిపారు. కావలసిన రైతులు తమ పట్టదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్‌తో రైతు సేవాకేంద్రాలను సంప్రదించి బయో మెట్రిక్ ద్వారా విత్తనాలు పొందాలని కోరారు.

అందుబాటులో ఉండే కేన్సర్ చికిత్సపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అందరికీ అందుబాటులో ఉండే క్యాన్సర్ చికిత్సపై టాటా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ దృష్టి పెట్టిందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ పిఎస్ ప్రమేష తెలిపారు. జాతీయ క్యాన్సర్ గ్రిడ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాప్టర్ శని, ఆదివారాల్లో శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, తిరుపతిలో తమ 3వ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ కేన్సర్ డాక్టర్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో హెూమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ వంటి కేంద్రాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ సంవత్సరం సమావేశానికి డాక్టర్ ఉమేష్ మహంత్‌శెట్టి (హెూమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్), డాక్టర్ ప్రసాంత్ పెనుమాడు (ఎస్ విఐసిసిఏఆర్ వైద్యనిర్దేశకులు) నాయకత్వం వహించారు. ఈ సమావేశం జీనిటో-యూరినరీ, గ్యాస్ట్రోఇంటెస్టినల్, లివర్ సంబంధిత క్యాన్సర్లపై దృష్టి సారించింది. ఈ మార్గదర్శకాలను పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి డాక్టర్లతో చర్చలు జరిపారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఆన్‌లైన్ ద్వారా, డాక్టర్ కైలాష్ శర్మ, డాక్టర్ ఉమేష్ మహంత్‌శెట్టి, ఎన్టీఆర్ వీఎస్‌టీ సీఈఓ దినేష్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం డబ్బు ఇప్పించండి

పోలీస్ స్టేషన్ ముందు వేచిఉన్న రైతులు

ప్రజాశక్తి - వెంకటగిరి : తమ ధాన్యం సొమ్ము ఇప్పించాలని ఏర్పేడు మండలం, పల్లాం సమీప గ్రామాలలోని రైతులు వెంకటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు 2023 మార్చి రబీ సీజన్ వరి ధాన్యం పల్లం సమీప గ్రామాలలోని రైతులందరూ కలిసి (సుమారు 1700 బస్తాలు) వెంకటగిరికి చెందిన దళారి కె.లోకేశ్వర్ నాయుడుకి విక్రయించారు. ఆయన ధాన్యాన్ని కర్ణాటక, దవనగిరికి చెందిన శ్రీనివాసులుకి దవనగిరి ఏపీఎంసి మార్కెట్ యార్డ్‌లో విక్రయించాడు. ఇతను లోకేశ్వర్ నాయుడుకి రూ. 3 లక్షలు చెల్లించి, మిగతా రూ.30 లక్షల 25 వేలు అదే రోజు బ్యాంకు ద్వారా ఇప్పిస్తామని చెప్పాడు. కానీ బ్యాంకు సమయం ముగియడంతో మరుసటి దినం అందజేస్తానని చెప్పగా లోకేశ్వర్ నాయుడు తిరిగి వచ్చేయడం జరిగింది. కానీ మరుసటి దినం నుంచి అతనికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో వెంకటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంకటగిరి పోలీసులు కర్ణాటక దవనగిరికి వెళ్లి నిందితుడు శ్రీనివాసులను అరెస్టు చేశారు. రైతులు వెంకటగిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమకు రావాల్సిన ధాన్యం డబ్బు ఇప్పించాలని సిఐని కోరారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

ప్రజాశక్తి -కోట : రోటరీ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ షేక్ జలీల్ అహ్మద్ తెలిపారు. ఆదివారం కోట మండలంలోని పెన్షనర్ల సంఘం భవనం కార్యాలయంలో రోటరీ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్, సెక్రటరీ, పలువురు మెంబర్‌లను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా షేక్ జలీల్ అహ్మద్, సెక్రటరీగా సుబ్రహ్మణ్యంలను ఎన్నుకున్నారు. కోకర్ల మధు యాదవ్, దోసకాయల కృష్ణమూర్తి, మోహన్ వంశీ తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్‌ను అభివృద్ధి మార్గంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట, వెంకటగిరి, కోట రోటరీ క్లబ్ సభ్యులు, ముని గిరీష్ నెల్లూరు మోహన్ రెడ్డి,జిమ్మీ ప్రసాద్, సీనియర్ న్యాయవాది పెల్లేటి గోపాల్ రెడ్డి, కోకర్ల మధు యాదవ్, పసుపులేటి కిషోర్, దారా సురేష్, మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, శంషుద్దీన్, నౌషద్, తిరుమల శెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టేప్ ఎక్స్‌పోతో భవన నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టేప్ ఎక్స్‌పోతో భవన నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ మహబూబ్ బాషా, క్రెడాయి తిరుపతి చాప్టర్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, టిడిపి రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్‌లు తెలిపారు. ఆదివారం టేప్ ఎక్స్‌పో రెండో రోజు ప్రదర్శన సందర్భంగా పలు స్టాల్స్‌ను వారు పరిశీలిచారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ భవన నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఇలాంటి ఎక్స్‌పో లు తిరుపతి నగరంలో మరిన్ని నిర్వహించాలని కోరారు. తిరుపతి నగరం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే గృహ నిర్మాణ పరికరాలు యంత్రాలు పొందుపరచడం ఎంతో బాగుందని కొనియాడారు. తిరుపతి జిల్లాతో పాటు చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వినియోగదారులు తరలి రావడం శుభ పరిమాణమం అన్నారు. తిరుపతి నగరంలో అపార్ట్మెంట్లతో పాటు విల్లాలకు ఆదరణ పెరుగుతుందని చెప్పారు. వినియోగదారుడి అభిరుచికి అనుగుణంగా టేప్ ఎక్స్‌పో నిర్వహించడం జరిగిందన్నారు. టేప్ ఎక్స్‌పో వల్ల ఎన్నో సలహాలు, సూచనలు పొందడం సులువయిందన్నారు. ఈ ఎక్స్ పో కార్యక్రమంలో లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. ఏసీపీ ఈ బాలాజీ, మూర్తి డిసిసిబి బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. తిరుపతి నగర ప్రజలు, పరిసర ప్రాంతాల నివాసితులు, ఇంటి నిర్మాణంపై ఆసక్తి కలిగిన అనేక మంది సందర్శకులు ఎక్స్‌పోలో పాల్గొని విస్తృత సమాచారం అందించడంతో ఎంతో సంతృప్తి చెందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టేప్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, చైర్మన్ తుముకు వెంకటేష్ బాబు, సెక్రటరీ బుస షణ్ముఖం, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్, వెల్ఫేర్ సెక్రటరీ సురేష్, కార్యవర్గ సభ్యులు వసంత్, ఆర్.ఆర్. శ్రీనివాస్, కేల్ కిషోర్, శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్ రఘురాం రెడ్డి కీలక పాత్ర పోషించారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బడుగుల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు అన్నారు. 4వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గడచిన ఏడాది కాలంలో అనేక సంస్కరణలు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేపట్టారని ఉమేష్ తెలిపారు. మాజీ మంత్రి బొజ్జల మానస పుత్రిక స్కిట్ కు ప్రాణం పోసేందుకు సుధీర్ రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలు మరవొద్దని సూచించారు. దశరథ ఆచారి, మిన్నల్ రవి, యం.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తడుకు గ్రామ పంచాయితీలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు, రూరల్ మండల క్లస్టర్ ఇంఛార్జి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పుత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు అరవ బాలాజీ, కార్యదర్శి హేమంత్, యూనిట్ ఇంచార్జి ఆదిమందడి, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండలం, సిద్ధవరం పంచాయతీ, ఇల్లకురుపాడులో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు వంద శాతం పూర్తి చేసిన దామరపు బాబుకు తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ అభినందనలు తెలిపారు.

ఆటో యూనియన్ నగర మహాసభ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆటో యూనియన్ తిరుపతి 7వ నగర మహాసభ జూలై 29వ తేదీ మంగళవారం జరిగే కరపత్రాన్ని ఆదివారం యశోద నగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వేణుగోపాల్, ఆటో యూనియన్ నగర కార్యదర్శి జి.వాసు మాట్లాడుతూ సిఐటియు అనుబంధంగా ఉన్న ఆటో యూనియన్ తిరుపతి ఏడో నగర మహాసభలలో ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చించి రాబోయే రోజుల్లో పోరాటాలు చేపడతామని తెలిపారు. ఆటో డ్రైవర్లకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనుభవం ఆధారంగా చదువు లేని డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగే ఆటో యూనియన్ నగర మహాసభలో డ్రైవర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కరపత్రం ఆవిష్కరించిన వారిలో సిఐటియు నేతలు బాలాజీ, రామకృష్ణ, మోహనరావు, ఆటో యూనియన్ నాయకులు ప్రసాదు, రవి, హేమాద్రి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన అధ్యక్షులుగా రామదాసు

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండల పరిధిలోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఆదివారం శ్రీకాళహస్తి, కొత్తపేట కాలనీ, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భవనంలో నూతన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షునిగా టి.రామదాసు, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతి చెందిన బాలరాజు

ప్రజాశక్తి - ఓజిలి : మండల పరిధిలోని రాజుపాలెం జాతీయ రహదారి వద్ద ఆదివారం ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొండంతో ద్విచక్ర వాహదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాలు మేరకు ఓజిలి మండల పరిధిలోని చిల్లమానుచేనుకు చెందిన కొండూరు బాలరాజు (54) గూడూరు ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులకు హాజరయ్యే నిమిత్తం చిల్లమానుచేను నుండి గూడూరుకి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో రాజుపాలెం జాతీయ రహదారి వద్ద వెనక వైపు నుండి వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ కే.శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

వాకర్స్‌కు ఉచిత శాశ్వత సభ్యత్వం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, కరకంబాడి రోడ్డు, వినాయకసాగర్ వద్ద నూతనంగా ఏర్పడిన వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో వాకర్స్ సభ్యులకు గుర్తింపుకార్డులను వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవసేవలో భాగంగా వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం నూతనంగా క్లబ్‌లో ఎటువంటి రుసుము లేకుండా వాకర్స్ సభ్యులకు ఉచితంగా సభ్యత్వం, గుర్తింపు కార్డు జారీచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 350 మంది సభ్యులను చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, ఉపాధ్యక్షురాలు శాంతి నాడార్, కార్యదర్శి లాయర్ చంద్ర కోశాధికారి రామసుబ్బారెడ్డి, విజయకుమార్ రాజు, రాము, హరి, రమేష్ , నరసింహారెడ్డి , వరలక్ష్మి, శాంతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మహతి ఆడిటోరియంలో చివరి రోజు జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 25ఏళ్ళుగా కళలను ప్రోత్సాహిస్తున్న అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బిఎన్ రెడ్డిని అభినందించారు. ఈ వేదికపై ప్రదర్శించిన 'స్వేచ్ఛలో స్వీయ నియంత్రణ అవసరం' నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు వరప్రసాద్, కోదండ, కూరపాటి సురేష్, అభినయ ఆర్ట్స్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని 19 పంచాయితీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విచ్చలవిడి మద్యం విక్రయాలతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ సమావేశానికి హాజరు కావడం లేదని, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్య తీసుకోవాలని పై అధికారులకు తెలియజేయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట జడ్పిటిసి సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, ఎంపీడీవో కె.సురేష్ బాబు, తహశీల్దార్ రాజేంద్ర, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ
మార్కాపురం ఆరవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
ఎం.వి.ఓ.పి. నెం: 8/2024
భీమిశెట్టి శ్రీనివాసరావు వగైరా ...... పిటీషనర్లు
వర్సెస్
కె.ధర్మరాజ్ వగైరాలు .... రెస్పాండెంట్లు
టు,
ఆర్-4.
జైమాతా ప్రైవేట్ ట్రావెల్స్/అమేజాన్ ఎక్స్‌ప్రెస్ టూర్స్ అండ్ ట్రావెల్స్,
రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొ॥ బి.సుధీర్,
డోర్ నెం: 1-67, పుడి రోడ్డు, తిరుచానూరు,
తిరుపతి మండలం, తిరుపతి జిల్లా.
పై నెంబరు క్లయిమ్ పిటీషనులో, పిటీషనర్లు నష్టపరిహారం కోరుతూ పై కోర్టులో పై నెంబరు గల కేసును దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన నీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను నీవు అందుబాటులో లేని కారణంగా పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున వాయిదా 25-08-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పైవిషయంను మీ పరోక్షముగా తీర్మానించబడును అని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 25-08-2025
దొండపాటి గాంధీరెడ్డి
న్యాయవాది, మార్కాపురం.
సెల్: 9000020664.